



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1200 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## -8-

ఈ భాగంలో 1950 నుండి 1980 వరకు వచ్చిన పత్రికల గురించి తెలుసుకుందాం. ఈ భాగానికి "వ్యాపారాత్మకం, అయినా విలువలకే ప్రాధాన్యం". ఈ విభాగంలో చేర్చదగిన పత్రికల గురించి తెలుసుకుందాం. అందులో మొదట మనం వివరాలు తెలుసుకోబోతున్న పత్రిక "ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక. ఇది 1952 లో ఆంధ్రప్రభ దినపత్రికకు అనుబంధంగా అదే గ్రూపు నుండి ప్రారంభం అయింది. ఆంధ్రపత్రిక విషయంలో ఐతే వారపత్రిక ముందు మొదలై, తరవాత దినపత్రిక జత అయింది. ఇక్కడ ఆంధ్రప్రభ దినపత్రిక మొదట 1938 లో మొదలై, 14 సంవత్సరాల తర్వాత, వారపత్రిక దానికి జత చేరింది. ఆంధ్రపత్రిక ప్రారంభించిన సాంప్రదాయమే ఇక్కడా కొనసాగి, దినపత్రిక సంపాదకుడే వారపత్రికకు కూడా అధికారిక సంపాదకుడిగా ఉండేవాడు. అంటే, నార్ల వారు ఆంధ్రప్రభలో పనిచేసినన్ని రోజులూ ఆయనే వారపత్రికకు కూడా సంపాదకులు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక మొట్టమొదట సంచిక 1952 ఆగస్టు 15 న విడుదలయింది. వెల 4

అణాలు. మొదటినుంచి జాతీయ వాదానికి మద్దతు నిస్తున్న పత్రిక ఆంధ్రప్రభ కాబట్టి, ఆంధ్రప్రభ వారపత్రిక ఆరంభాన్ని కూడా బహుశా ఆగస్టు 15 న ఎంచుకొని ఉండవచ్చు. ఈ వారపత్రిక మొదలవ్వడానికి ఒక వారం రోజులు ముందు దినపత్రిక ఇదిగో ఇలా వుంది.

"పిల్లలకూ, పెద్దలకూ, స్త్రీలకూ, పురుషులకూ..... కథలకూ,నాటికలకూ, వృద్ధులకూ, సూక్తులకూ, నాటకాలకూ, నవలలకూ, పద్యలకూ, పాటలకూ... ఉజ్వలతకూ ఉదాత్తతకూ, చురుకైన వ్యాసాలకూ, బరువైన వాఖ్యాలకూ, తెరపైకి తారలకూ, కరుకైన వక్రోక్తులకూ.... ఆంధ్ర సంస్కృతికీ , సాహిత్య రంగాలకు అఖండ జ్యోతి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక. వెల నాలుగు అణాలు ఆగస్టు 15 న ఆరంభం. "

దినపత్రిక విషయంలో ఎలాగైతే, తన ముద్రవేసి, అతి కొద్దికాలం లోనే తన సర్క్యులేషన్ ను అధికమించగలిగారో, నార్ల వారు ఆంధ్రప్రభ విషయంలో కూడా అదే మేజిక్ చూపించారు. ఏ పత్రికైనా మార్కెట్ లోకి వచ్చేటప్పుడు అంతవరకూ వున్న పత్రికలకంటే, భిన్నంగా ఎలా ఉంటుంది? అనేది ప్రధానాంశం. ఈ విషయంలో కూడా సంపాదకుడు నార్ల వారు మొదటినుంచే విన్నూతనమైన శీర్షికల మీద దృష్టి కేంద్రీకరించారు. పత్రిక రూపకల్పనలోనూ, ముఖచిత్రం లోనూ పదునైన సంపాదకీయాల విషయంలోనూ ఆంధ్రపత్రిక వారపత్రిక కంటే, పూర్తి భిన్నంగా, విలక్షణంగా ఉండేలాగా శ్రద్ధ తీసుకున్నారు నార్ల గారు. మొదటి సంవత్సరం సంచికలు అంటే 1952 ఆగస్టు నుండి 1953 ఆగస్టు వరకు నా పరిశోధనకు లభ్యం కాలేదు. నాకు దొరికిన సంచిక "1953 సెప్టెంబర్ 30.ఆంధ్రప్రభ"

ఇది ఆంధ్రరాష్ట్ర అవతరణ ప్రత్యేక సంచిక. 116 పేజీలతో కలెక్టర్స్ ఎడిషన్ లాగ వెలువడింది. ఈ పత్రికకు ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేక లోగో ముఖ చిత్రంగా వుంది. అయితే లోపల పేజీలో ఒక పూర్తి పేజీని పొట్టి శ్రీరాములు గారి చిత్రానికి కేటాయించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అనేక ముఖ్య ఘట్టాలను గురించిన వివరణాత్మక వ్యాసాలతో పాటుగా, నవ్యాంధ్ర నిర్మాతలు అనే శీర్షికతో ఆ ఉద్యమం మీద ప్రభావం చూపించిన ప్రముఖుల ముఖ చిత్రాలను, సంచిక మొదటి నుండి చివరి వరకూ, రకరకాల పేజీల్లో ప్రచురించారు. వీళ్ళలో కొండా వెంకటప్పయ్య గారూ, కాశీనాధుని నాగేశ్వరావు పంతులు గారూ, కోపల్లి హనుమంతరావుగారూ, మొదలైన వాళ్ళందరూ వున్నారు.

అప్పటికే 1953 సంచికలోనే మాలతీ చందూర్ గారి "ప్రమదావనం "శీర్షిక వ్యాసాలూ, అలాగే పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు కూడా వున్నాయి. బహుశా మాలతీ చందూర్ గారి శీర్షికలు మొట్టమొదటి సంచిక నుంచే వుండి ఉండవచ్చు. మాలతీ చందూర్ గారి ఆ శీర్షికలు దశాబ్దాల పాటు కొనసాగడం ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చరిత్రలో ఒక అధ్యాయగా చెప్పుకోవచ్చు. ఒక మహిళా కాలమిస్ట్ దాదాపుగా 5 దశాబ్దాలపాటు ఒక పత్రికలో ఆ శీర్షికలు నిర్వహించడం అనేది ఆంధ్రప్రభ వీక్లి ప్రత్యేకత, మాలతీ చందూర్ గారి ప్రత్యేకత అని కూడా

చెప్పుకోవచ్చు. సినిమా వార్తలూ, బాలల కోసం ప్రత్యేక శీర్షికలూ, ఇవన్నీ కూడా మొదటి నుంచే ఉండేవి. ఆంధ్రప్రభ ప్రారంభమైన అర్ధ శతాబ్దంలో ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రజాదరణ పొందిన అనేక నవలలు సీరియల్స్ గా వచ్చేయి. కొన్నిటిని చూసుకుంటే ప్రముఖ రచయిత్రి తెన్నేటి హేమలత “పథవిహీన“ , రచయిత్రిగా రంగనాయకమ్మ గారు, ముప్పాళ్ల రంగనాయకమ్మ పేరుతో వ్రాసిన “కృష్ణవేణి”, పేకమేడలు, బలిపీఠం యిలాంటివన్నీ 1960 దశకంలో ఆంధ్రప్రభలో సీరియల్స్ గా వచ్చాయి.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక అనగానే ఆనాటి తెలుగు పాఠకులకు వెంటనే గుర్తుకువచ్చేది. “ఉగాది నవలల పోటీలు” . ఆధునిక నవలల ఆధారంగా తెలుగు సినిమాలు రూపొందడం అనే సంప్రదాయం “డాక్టర్ చక్రవర్తి”తో ప్రారంభమయింది అనుకుంటే – అంతకు ముందే వచ్చిన బారిస్టర్ పార్వతీశంను మినహాయిస్తే – డాక్టర్ చక్రవర్తి సినిమాకు ఆధారమైన నవల ఆంధ్రప్రభలో 1962 ఉగాది పోటీల్లో “చక్ర భ్రమణం“ మొదటి బహుమతి పొందింది. ఆ సందర్భంలోని ఆంధ్ర ప్రభ వీక్లి సంపాదకీయం, నవలల పోటీ ఫలితాల ప్రకటన, రచయిత్రి కోడూరి కౌసల్య దేవిగారి పరిచయం ఆనాటి సంచికలో వున్నాయి. (ఆసక్తి కలిగినవారు యూ ట్యూబ్ లో చూడవచ్చు)

ఆ ఎడిటోరియల్ లో ఏం రాసారంటే? ఉగాది నవలల పోటీలు ప్రకటిస్తూ...

ఈ పోటీలో మొదటి బహుమతి 750 రూపాయలు పొందిన నవల “చక్రభ్రమణం”. రచయిత్రి శ్రీమతి కోడూరి కౌసల్యా దేవి. రాజమండ్రి. రెండవ బహుమతి 500 రూపాయలు పొందిన నవల “ఇంద్రధనుస్సు” రచయిత శ్రీ వల్లంపాటి వెంకట సుబ్బయ్య, చిత్తూరు. మూడవ బహుమతి 300 రూపాయలు పొందిన నవల “లోకం పోకడ” రచయత హరికిషన్, శ్రీమతి బోడపాటి దమయంతి దంపతులు విజయవాడ.

మొదటి బహుమతిని ఒక రచయిత్రి పొందడం మిక్కిలి అభినందనీయమైన విషయం. స్త్రీలు సాహిత్య రంగంలో ముందంజ వేశారు అనడానికి మరొక నిదర్శనం. ఈ పోటీల్లో రాష్ట్రం లోని అన్ని జిల్లాల వారూ పాల్గొనడం గొప్ప విషయం. ఉగాది పోటీకి వచ్చిన నవలల్లో ప్రచురణార్హమైన అన్నిటినీ పఠించి, బహుమతుల నిర్ణయములో అల్ప వ్యవధిలో మాకు తోడ్పడిన ప్రసిద్ధ రచయిత శ్రీ త్రిపురనేని గోపిచంద్ కు మా నమస్సులు సమర్పిస్తున్నాము. తొలుత ప్రకటించినట్లుగా ఉగాది పోటీకి వచ్చిన నవలల సంఖ్య 183. ఇలాగే ఇక ముందు కూడా రచయితలూ, రచయిత్రులూ తమ సహాయ, సహకారాలతో పాఠకలోకానికి ఉత్తమ నవలలు అందజేయాలని మా పూనిక విజయవంతంగా నడవాలని మరొక పర్యాయం సవినయంగా ప్రార్ధిస్తున్నాము. —— ఎడిటర్ నీలం రాజు వెంకట శేషయ్య – అని వ్రాశారు.

1952 నుండి ఆంధ్రప్రభ కొనసాగిన ఆ 5 దశాబ్దాల కాలంలో అప్పటి సమకాలీన రచయితలందరూ కూడా ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో నవలలు రాసినవాళ్ళే. మల్లాది వెంకట కిష్ణ మూర్తి గారి మొట్టమొదటి ధారావాహిక నవల "అద్దె కిచ్చిన హృదయాలు" ఆంధ్రప్రభలో వచ్చినదే. 2001 లో గొల్లపూడి మారుతీ రావుగారి నవల "సాయంకాలమైంది" నవల కూడా ఆంధ్రప్రభలోనే సీరియల్ గా వచ్చింది. కొమ్మూరి వేణుగోపాలరావు, మల్లాది, యండమూరి దగ్గర నుండి ఆధునిక రచయతలు అనేక మంది రచయితల రచనలు సీరియల్స్ గా రావడానికి ఆంధ్ర ప్రభ వీక్లి వేదిక అయ్యింది.

ఇంకా శీర్షికల విషయం చూసుకుంటే, ఆ విషయంలో కూడా ఎప్పటి కప్పుడు తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ ముందుకు సాగింది ఆంధ్రప్రభ. మొట్ట మొదటి సంచికలోనే విద్వాన్ విశ్వం గారి "తెలుపు–నలుపు" విశ్లేషణాత్మక వ్యాసాలు వున్నాయి. ఆ తరవాత "విద్వాన్ విశ్వం గారి "మాణిక్య వీణ"ఆంధ్ర ప్రభలో వచ్చిన ప్రసిద్ధమైన శీర్షికల్లో ఒకటి. చలం గారి మ్యూజింగ్స్ శైలిలో సాగిన లతగారి "ఊహాగానం "శీర్షిక కూడా ప్రభలో సంవత్సరాల పాటు కొనసాగింది మొదటి రోజుల్లోనే. మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి గారి "నటరత్నాలు" రంగస్థల కళాకారుల పరిచయ శీర్షిక కూడా ఆంధ్ర ప్రభలోనే ప్రచురితమైనది.

అంధ్రప్రభ వారపత్రిక మరో ప్రత్యేకత – సంక్రాతి, ఉగాది ప్రత్యేక సంచికలు. పాఠకులందరూ ఆ రోజుల్లో ఈ ప్రత్యేక సంచికలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తూండేవారు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికను 50 సంవత్సరాలపాటు సమర్ధవంతంగా కొనసాగించిన సంపాదకులలో కొంతమంది – నార్ల వెంకటేశ్వరావుగారు, 1959 లో ఆంధ్ర ప్రభ గ్రూపును వదిలేశాక, నీలంరాజు వెంకట శేషయ్య గారు దశాబ్దం పాటు దినపత్రికతో బాటు, వార పత్రికకు కూడా సంపాదకులుగా వున్నారు. ఆ తర్వాత పి. నాగేశ్వరావు గారూ, విద్వాన్ విశ్వంగారూ, పొత్తూరి వెంకటేశ్వరావుగారూ, వాకాటి పాండురంగారావుగారూ, రాజేంద్రగారూ , ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారూ, వల్లూరి రాఘవరావుగారూ 2004 ప్రాంతం లో యాజమాన్యం మారాక, కొమ్మినేని వాసుదేవరావు గారూ... వీళ్లంతా ప్రభ వీక్లి సంపాదకులుగా చేశారు.

ఎక్స్ ప్రెస్ గ్రూపు నుంచి ఆంధ్రప్రభను ముత్తా గోపాలకృష్ణగారు కొనుగోలు చేశాక, 2004 ప్రాంతాల్లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిలిచిపోయింది. 1940–60 ఆ మధ్యలో చాలా వార పత్రికలు వచ్చాయి గానీ, అవేమీ 4,5 సంవత్సరాలు మించి కొనసాగలేదు. ఆంధ్రపత్రిక తర్వాత, ఆ రోజుల్లో మొదలై సుదీర్ఘ కాలం కొనసాగి, ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో తన దైన స్థానాన్ని నిలుపుకుంది ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక. ఇవండీ ఆంధ్రప్రభకు సంబంధించిన సంక్షిప్త సమాచారం.

ఇప్పుడు మరో వర్గానికి చెందిన పత్రికల గురించి తెలుసుకుందాం, అవే సినిమా పత్రికలు. ఎక్కువ సినిమా పత్రికలు 1950 లలో మొదలైనా గానీ, 1950 కి ముందే కొన్ని సినిమా పత్రికలు వచ్చాయి. వాటిల్లో చెప్పుకోదగినది "తెలుగు సినిమా". ఇది 1945 మధ్యలో మొదలై, పదేళ్ల పాటు సుమారు 1952-53 వరకు నడిచింది. ఈ తెలుగు సినిమా పత్రిక విశేషం ఏమిటంటే, దీని పబ్లిషర్ కొమ్మూరి వెంకటరామయ్య గారు. ఆ రోజుల్లో అంటే మనం మాట్లాడుకుంటున్న 1945 ప్రాంతాల్లో ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపుతున్న సంచలన రచయిత గుడిపాటి వెంకటాచలంగారి తమ్ముడే ఈ కొమ్మూరి వెంకటరామయ్య గారు. ఆయన భార్యే "రైతుబిడ్డ "లాంటి చిత్రాల్లో నటించిన కొమ్మూరి పద్మావతిగారు. వాళ్ళ అబ్బాయే తరవాత రోజుల్లో ప్రముఖ డిటెక్టివ్ రచయిత కొమ్మూరి సాంబశివరావు గారు. తరవాత రోజుల్లో వీళ్ళ అల్లుడే కొడటిగంటి కుటుంబరావు గారు.

"తెలుగు సినిమా" పత్రిక విషయానికి వస్తే, పబ్లిషర్ కొమ్మూరి వెంకటరామయ్య గారు. అయితే, సంపాదకుడు వాళ్ళ అబ్బాయి కొమ్మూరి సాంబశివరావు గారు. వీళ్ళు ఆ పత్రికను సుమారు 7 ఏళ్ళ పాటు నిర్వహించారు. ఈ సందర్భంలో మరో విషయం తెలుసుకోవాలి. ఆ దశాబ్దంలో అంటే 1940-50 మధ్యలో కొంత మంది రచయితలు వివిధ కారణాల వల్ల, తెనాలి నుండి మద్రాస్ కు వలస వెళ్లారు. వాళ్లల్లో మొట్టమొదటివారు చక్రపాణి గారైతే, ఆ తరువాత కొమ్మూరి వెంకటరామయ్య గారూ, కొడవటిగంటి కుటుంబరావు గారూ, ధనికొండ హనుమంతరావు గారూ, చందమామ దాసరి సుబ్రహ్మణ్యం గారూ... వీళ్లంతా వెళ్లారు.

వీళ్ళలో కొంత మంది తెనాలిలో ఉండగానే పత్రికలు ప్రారంభించడం, పుస్తకాలు ప్రచురణ చేపట్టడం, ఆ తరవాత మద్రాస్ వెళ్లి వాటిని కొనసాగించడం, ఇదంతా చాలా ఆసక్తికరమైన చరిత్ర. ఆ చరిత్రలో భాగమే ఈ "తెలుగు సినిమా" పత్రిక. చాలా ఆసక్తి కరమైన విషయాలతో రూపొందేది ఈ పత్రిక. 1948 జనవరి సంచికలో సంపాదకీయాన్ని చూద్దాం. 1947 డిసెంబర్ లో "ప్రతి వూర్లోనూ సినిమా ప్రేక్షక సంఘాలు అనేవి ఉండాలి. అవి స్థానికంగా వుండే థియేటర్ లలో సౌకర్యాలు సరిగ్గా ఉండేలా చూడడం, ప్రేక్షకులకు ఇబ్బందులు ఏమైనా ఉంటే, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం, ఇలాంటి పనులు ఆ ప్రేక్షక అభిమాన సంఘాలు చెయ్యాలి" అని రాశారు. అది చదివిన వెంటనే కొంత మంది విజయనగరంలో కొంత మంది "సినిమా ప్రేక్షక సంఘం"అని ప్రారంభించారు. దాని గురించి వ్రాస్తూ 1948 జనవరి సంపాదకీయంలో ఇలా రాసారు కొమ్మూరి సాంబశివరావు గారు, బహుశా వాళ్ళ నాన్నగారి పాత్ర కూడా అందులో ఉండి ఉంటుంది.

తెలుగు సినిమా, సంపుటి:3, జనవరి 1948, సంచిక :6.

సినిమా ప్రేక్షక సంఘాలు విజయనగరంలో ప్రారంభం.

"థియేటర్ల యజమానులు, ప్రేక్షకుల సౌకర్యాల పట్ల శ్రద్ధ వహించాలి. సాంఘిక ప్రయోజనం గల విజ్ఞాన, ప్రబోధాత్మక, కళాత్మక చిత్రాలు తీయాలి. ఇవి అమల్లోకి తీసుకురావడమే విజయనగరంలో ప్రారంభించిన సినిమా ప్రేక్షకుల సంఘం ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఉద్దేశ్యాలతో ఎవరికీ అభిప్రాయం బేధం ఉండదు. డిసెంబర్ సంచికలో మా సంపాదకీయ వ్యాసం చదివి, దానికి ఫలితంగా ఇంత త్వరగా సినిమా ప్రేక్షక సంఘాన్ని స్థాపించినందుకు విజయనగరం సినిమా ప్రేక్షకులు ప్రసశంసనీయులు. కానీ, "ఇటు వంటి సంఘాలు స్థాపించబడినంత మాత్రానా చిత్ర నిర్మాతలూ, థియేటర్ యజమానులూ వారి వైఖరి మార్చుకుంటారా ?ఇటువంటి సంఘాలు ఎన్ని స్థాపించి, ఎంత కృషి చేసినా ఫలితం వుంటుందా?" అని అనుమానం కలుగుతుంది కొంత మందికి. సినిమా ప్రేక్షక సంఘాలు శ్రద్ధతో ఓపికతో పనిచేస్తే, ఫలితాలు సిద్దించగలవని మేము చెప్పగలము."

జనవరి సంచికలో కొడవటిగంటి కుటుంబరావు గారు "సినిమా కథలు ఎలా ఉంటున్నాయి?ఎలా ఉండాలి?"అని చాలా ఆసక్తికరమైన వ్యాసం ఇలా రాసారు.

"అభ్యుదయ రచయితల దృష్టిలో కళ , సర్వ జనోపయోగయుక్తంగా ఉండడం తప్పు కాదు. కానీ, అభ్యదయ కళను ఆస్వాదించేవాడికి, ఇది నా కోసమే సృష్టించారు అనే భావం కలగక పోవడం చాలా తప్పు" ఇలా అసలు సినిమా కథలు ఎట్లా ఉండాలి అని చక్కని విశ్లేషణను రాసారు.

ఈ తెలుగు సినిమా పత్రిక కేవలం సినిమా వార్తలూ, తారల కబుర్లే కాకుండా, సినిమా పరిశ్రమలోని వివిధ కోణాలనూ విశ్లేషించి, నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వడం అనేది దాని ప్రత్యేకతగా నిలిచింది ఆ రోజుల్లో. గాసిప్స్, నటీనటుల మెప్పులకోసం వ్యాసాలూ ఇలాంటివి అంత ఎక్కువగా ఉండేవి కావు. ఇంకా చిత్ర సీమలో నటీనటుల ఆధిక్యత అంత ఎక్కువగా లేకపోవడం కూడా ఈ సినిమా పత్రికలు ఆరోగ్యవంతంగా కొనసాగడానికి ఎంతో కారణం అయింది.

అవసరమైనప్పుడు ఎవరినీ విమర్శించడానికి వెనకాడని ధైర్యం కూడా, ఈ సినిమా పత్రికలో కనబడుతోంది. ఉదాహరణకు 1951 మే సంచిక సంపాదకీయంలో కొమ్మూరి సాంబశివరావు గారు ఇలా రాసారు.
"ఎందుకీ పొంగూ, ఉత్సాహం. రోజుకో కొత్త చిత్రం పేరు ప్రకటింపబడుతోంది. సినిమా తీస్తానంటూ రోజుకో కొత్త ఆసామీ పట్నంలో అడుగుపెడుతున్నాడు. పట్టుమని పది చిత్రాల్లో కూడా పని చెయ్యని నటీనటులూ, టెక్నీషియన్లూ చిత్రాలకు ముహుర్తాలు పెట్టి, ప్రారంభోత్సవాలు జరుపుతున్నారు. మేం మాత్రం ఏం తక్కువ తిన్నామా అన్నట్లు డిస్టిబ్యూటర్లు కూడా చిత్ర నిర్మాణానికి ఉపకరిస్తున్నారు.

ఎందువల్ల ఈ పొంగు?ఎందుకీ ఉత్సాహం? వ్యవసాయమో, వ్యాపారమో చేసుకుంటూ వుండే ఆసామీలకు సినిమా వ్యాపారం మీద ఆకస్మికంగా ఎందుకు ఇంత మోజు కలిగింది? నటులుగా, టెక్నీషియన్లుగా

సినిమాల్లో ఒడిదుకులు లేకుండా కాలం గడుపుతున్న పారిశ్రామికులకు చిత్ర నిర్మాణం పైకి దృష్టి ఎందుకు పోతోంది? చిత్రాలు పంపిణీ చేసి, హాయిగా లాభాలు పంచుకునే డిస్ట్రిబ్యూటర్లు ఈ కొత్త బాదరా బందీ ఎందుకు తెచ్చి పెట్టుకుంటున్నారు? ఎక్కువ డబ్బు సంపాదించాలి అనే సహజమైన కారణం అయివుండొచ్చు. సినిమా తళుకు తక్కినవారిని చప్పున ఆకర్షించి ఉండవచ్చు. కానీ, అన్నిటికంటే ముఖ్యమైన కారణం సినిమా నిర్మాణం చాలా సులభంగా కనిపించడం. అని మా అభిప్రాయం" అని అంత ధైర్యంగా రాశారు. ఇదంతా 1951లో. .

1950 మే సంచికలో అక్కినేని గారి వ్యక్తిత్వం గురించి విశ్లేషణా, హీరోయిన్ కృష్ణకుమారి గారి సమాధానాలూ, షావుకారి జానకి గారి ఇంట్లో ఫోటోలూ, రామశర్మ గారి జీవిత కథా, ఇలాంటివన్నీ కూడా వున్నాయి. 7,8 ఏళ్ళ పాటు ఆరోగ్యంగా, ధైర్యంగా నడచిన సినిమా పత్రిక "తెలుగు సినిమా". ఈ తెలుగు సినిమా పత్రిక మద్రాస్ నుండి వస్తున్న రోజుల్లోనే ఆసక్తికరంగా తెనాలి నుండి ఒక సినిమా పత్రిక ప్రారంభమయింది. దాని పేరే "సినిమా". 1949 జూన్ లో మొదటి సంచిక వచ్చింది. దాని సంపాదకులు రవీంద్రనాథ్, మాగాపు రామన్ అని వుంది. రవీంద్రనాథ్ అంటే, ఆలపాటి రవీంద్రనాథ్ అని నా అంచనా. మొట్టమొదటి సంచిక సంపాదకీయంలో ఇలా రాసుకున్నారు.

సంపుటి:1, సంచిక:1 , జూన్ 1949, "సినిమా " వెలువడబోతోంది. సినిమా వెలువడింది. సర్వాంగ సుందరంగా. సినిమా ముక్కోటి ఆంధ్రులకూ ఎలా ఉద్భవించినది అసలు? ఒకరోజున ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా వాదించుకున్నారు. చివరికి నిర్ణయించుకున్నారు. సర్వాంగ సుందరంగా వున్న , చక్కటి సందేశాన్నీ, విజ్ఞానాన్ని తయారు చేయగల పత్రిక తయారు చేయాలని, అది సమగ్ర లలిత కళా వాహిని కావాలనీ. ఎంత వరకూ కృతార్థులమైనాము అన్నాది పాఠకులు తమ అభిప్రాయాలు తెలిపే వరకూ, ప్రశ్నగానే ఉంటుంది. "సినిమా" వెలువడింది ఎవరిని ఉద్ధరించడానికి? సినిమా వెలువర్చే వారికీ లాభాలపై ఆశ లేక పోలేదు. కానీ, సంపాదకులకు కొన్ని నియమాలు కూడా వున్నాయి."

దీని కేంద్ర కార్యస్థానం తెనాలి. సంపాదక కార్యాలయం మద్రాస్. ఎందుకంటే సినిమా నిర్మాణం అంతా మద్రాస్ లో జరుగుతున్నది కాబట్టి, మద్రాస్ లో కొంత మందిని పెట్టి, తెనాలి స్థానంగా ఈ సినిమా పత్రికను వెలువరించారు.

ఈ పత్రిక వచ్చేటప్పటికే తెనాలి నుంచి "జ్యోతి"అనే పక్ష పత్రిక, "రేరాణి" అని ఇంకో మాస పత్రిక వస్తున్నాయి. వాటికీ తోడుగా ఈ సినిమా అనే ఈ పత్రికను తీసుకువచ్చారు. అందుకే ఈ సినిమా పత్రికకు టేగ్ లైన్ గా ఏం రాసారంటే? " జ్యోతి కూటమికి చెందిన మాస పత్రిక " అని. ఈ "సినిమా" అనే పత్రిక ఎక్కువ

రోజులు కొనసాగిన దాఖలాలు లేవు. ఒక సంవత్సరం లోపే మూతపడి పోయి ఉండాలి. అయినా గానీ, మద్రాస్ బయట ప్రారంభమైన తొలి సినిమా పత్రిక ఈ తెనాలి "సినిమా "అనుకోవచ్చు.

మళ్ళీ మనం "తెలుగు సినిమా" పత్రిక ఆగిపోయిన 1952 దగ్గరకు వస్తే, ఆ రోజుల్లోనే అంటే 1952 లో రెండు సినిమా పత్రికలు ఇంచు మించు ఒకే పేరుతో మొదలయ్యాయి. ఒకటి చందమామ చక్రపాణి గారి సారధ్యంలో ప్రారంభమైన "కినిమా" అయితే, రెండోది మధుమూర్తి అనే ఆయన సంపాదకత్వంలో ప్రారంభమైన "కినీమా ". అంటే మధ్యలో 'ని' కి దీర్ఘం వున్నదన్నమాట. మరి ఇంచు మించు ఒకే పేరుతో, ఒకేసారి రెండు సినిమా పత్రికలు ఎందుకు మొదలయ్యాయి? కారణాలు నాకు దొరకలేదు.

ముందుగా చక్రపాణి గారి "కినిమా" విశేషాలు చూద్దాం. సినిమారంగ విశేషాలకోసం ప్రారంభంచబడిన ఈ కినిమా తొలి సంచిక, 1952 సెప్టెంబర్ లో విడుదల అయింది. అప్పటికి విజయ ప్రొడక్షన్ వారు షావుకారు, పాతాళ భైరవి, విడుదలై "చంద్రహారం" ఇంకా నిర్మాణం లో వుంది. చందమామ పిల్లల మాస పత్రిక శరవేగంతో దూసుకుపోతోంది. అది కాకుండా చక్రపాణి గారు "ఆంధ్రజ్యోతి "అనే మాస పత్రికను కూడా తీసుకువస్తున్నారు. దీని విశేషాలు కూడా తర్వాత చెప్పుకుందాం. వీటన్నిటికీ మధ్య చక్రపాణి గారు ఈ కినిమా మాస పత్రికను తీసుకువచ్చారు. మొట్ట మొదటి సంచిక ముఖ చిత్రం "చంద్రహారం " చిత్రంలో చందన రాజుగా నటించిన N.T.R.

ఈ కినిమా పత్రిక ప్రారంభించాలి అనే ఆలోచన వచ్చిన దగ్గర నుంచి, చందమామలో ప్రకటన ఇవ్వడం మొదలు పెట్టారు. అప్పటికి సినిమా పత్రికలు వేళ్ళ మీద లెక్క పెట్టదగినవిగానే వున్నాయి. ఈ కినిమా పత్రిక ఎందుకు ప్రారంభించారు?ఏమేమి శీర్షికలు కొనసాగిద్దామని అనుకున్నారు. అనే వివరాలు మొట్ట మొదటి సంచిక సంపాదకీయంలో ఇలా రాశారు

"1952 సెప్టెంబర్, సంచిక:1, సంపుటి:1 "కినిమా" సంచాలకుడు చక్రపాణి.

"కినిమా "తొలిసంచికను సినిమా పాఠకలోకానికి అందిస్తున్నాం. ఈ పత్రిక ప్రారంభిద్దామని నిర్ణయించిన నాటి నుండి వివిధ రంగాల నుండి,ముఖ్యంగా సినిమా రంగం నుండి అంతులేని ప్రోత్సాహం లభించడం మా అదృష్టం. మన దేశంలో ప్రత్యేక సినిమా సాహిత్యం యొక్క ఆవశ్యకత గుర్తింపబడి, సినిమా పత్రికలు పారంభమై చాలా కాలం అయింది. అయితే, సినిమా ప్రపంచం వారూ, సినిమా ప్రేక్షకులూ కూడా సమంగా తమది అని భావించే, సినిమాపత్రిక లోటు కనిపిస్తోంది. ఈ లోటు పూర్తి చేయడానికి కినిమా ఉపయోగించినట్లయితే, మా ఆశయం కొనసాగుతుంది. దానికి గానూ, సినిమా కళాకారులూ, ప్రజలూ కూడా మాకు ఎంతో తోడ్పడ వలసి ఉంటుంది. ఇటు వంటి తోడ్పాటు మాకు పుష్కలంగా లభిస్తుందని ఆశిస్తున్నాము.

ఇంకా ఈ పత్రికలో ఏ ఏ శీర్షికలు కొనసాగించ దలచుకున్నారో ఇలా చెప్పారు. “చిత్ర వార్తలూ, తారా పథం”అనే సీరియల్ నవల. డైరెక్టర్ ప్రసాద్ బొంబాయి అనుభవాలూ, “నా తొలి సినిమా అనుభవం “అనే సింపోజియం. పాఠకుల సందేహాలూ, సమాధానాలూ, N. T . R . స్కెచ్ వగైరా వ్యాసాలు ప్రచురించాం. “నా తొలి అనుభవం”అనే సింపోజియం వరసగా వెలువడుతుంది. పాఠకులు సినిమారంగం గురించి, సినిమా నటుల గురించి, కినిమా లో వెలువడే వ్యాసాల గురించి ఏమైనా చెప్పదలచినట్లయితే, “జనవాక్యం” అనే శీర్షిక ద్వారా చెప్పుకోవచ్చు. పాఠకుల అభిరుచిని అనుసరించి కినిమాలో కొత్త శీర్షికలు కూడా ప్రవేశపెట్టగలము. ఒక విషయము మాత్రం స్పష్టంగా చెప్పగలము. కినిమాలో అనధికార వార్తలూ, ఆకాశ పోకాశ కబుర్లూ వుండవు”అంటే, ఎక్కడ గాసిప్స్ వుండవు అని మొట్ట మొదటి సంచికలోనే చెప్పారు.

రెండో సంచిక ముఖ చిత్రం సావిత్రి గారిది, మూడో సంచిక ముఖ చిత్రం అక్కినేని నాగేశ్వరావు గారిది. ప్రతి సంచిక కూడా నలుగురైదుగురు సినీ ప్రముఖులు తమ సినీ అనుభవాలు క్లుప్తంగా రాసేవాళ్ళు. ఇవి కాకుండా హిందీ సినిమా వార్తలూ, విదేశీ సినిమా వార్తలు కూడా ఇస్తుండేవారు. ఇప్పుడు ఎవరైనా అప్పటి సినిమాల గురించి పరిశోధన చేస్తుంటే, నాలాగా... కినిమా లోని తారల జీవిత విశేషాలు చాలా ఉపయోగకరం. ఎందుకంటే, ఇవన్నీ కూడా ఆరోజుల్లో తాజాగా రాసినవి కాబట్టి, వాటిల్లో ఊహలూ, కల్పనలూ , పొరపాట్లూ ఇలాంటివి ఎక్కువగా జరిగే అవకాశం ఉండదు. 1955 జనవరి కినిమా సంచికలో టంగుటూరి సూర్య కుమారిగారు తాను చేసిన విదేశీ ప్రయాణం గురించి చక్కటి వ్యాసం రాశారు. వున్నత ప్రమాణాలతో, ఆరోగ్యకరమైన సినిమా విశేషాలతో కినిమా పత్రికను నడపాలని నాగిరెడ్డి గారూ, చక్రపాణి గారూ ప్రయత్నించినప్పటికీ, పట్టుమని మూడు సంవత్సరాలు కూడా కొనసాగలేకపోయింది. మరి వాళ్ళకి ప్రెస్ వుంది. మందీ మార్బలం వుంది. అయినా నడవలేదు. బహుశా వివిధ ప్రాజెక్టుల మీద ఒకేసారి పనిచేయవలసి రావడమో ఎందుకనో గానీ 1955 ఏప్రిల్ నెలలోనే 32 వ సంచికలో ఆగిపోయింది. చిట్ట చివరి సంచిక సంపాదకీయంలో ఇలా రాసారు.

“సంపుటి:3, సంచిక:8 ఏప్రిల్ 1955 కారణాంతరాల వల్ల కినిమా పత్రికను ఈ సంచికతో నిలిపివేస్తున్నామని పాఠకులకు తెలియజేయడానికి విచారిస్తున్నాము. 1952 సెప్టెంబర్ తొలి సంచిక వెలువడింది. గడచిన 32 మాసాలలోనూ పత్రిక ఈ లోకానికి సినిమా ప్రపంచం గురించీ, అనేక వార్తలూ, వైజ్ఞానిక వార్తలూ అందించింది. పాఠకుల భావ ప్రకటనకు వినోదానికి అనేక శీర్షికలు నడిపింది. ఈ పత్రికను నిర్వహించడంలో మేము పడిన శ్రమ వృధా కాలేదు. కినిమా యెడల పాఠకులు ఎందరో ఆదరాభిమానాలు చూపించారు.”

ఇలా రాస్తూ... చక్రపాణి గారు “వేరే పత్రిక ఎవరు నడిపినా గానీ, పాఠకుల్లోకి వెళుతుంది”అని విశ్వాసాన్ని ప్రకటించారు. ఇటు వంటి సినిమా ప్రపంచానికీ, సామాన్య ప్రజానీకానికీ మధ్య సౌహార్ద రాయబారం

నడపడమే కినిమా తన ఆశయంగా పెట్టుకొని కృషి చేసింది. ఈ కృషి ఏ పత్రికైనా చేయవచ్చు. కినిమా వెనుకగా ఇంకా అనేక కినిమాలు రాగలవని ఆశిస్తూ పాఠకుల వద్ద నుండి సెలవు పుచ్చుకుంటున్నాము.

తరువాత పత్రిక "కినీమా ". ఇది చక్రపాణి పత్రిక కంటే ఒక నెల ముందుగానే 1952 ఆగస్టు లో మొదలయ్యింది. ఎడిటర్ "మధుమూర్తి " అని పేరు వుంది. అది కలం పేరో, అసలు పేరో తెలియదు. కినీమాలో వార్తలూ, విశేషాలూ ప్రామాణికంగా చక్కటి విలువలతో వున్నాయి. ఎక్కడా గాసిప్స్ లాంటివి లేవు. బాపు గారి వ్యంగ్య చిత్రాలు ఈ కినీమా కొన్ని సంచికల్లో ప్రత్యేకంగా కనిపించాయి. ఈ పత్రికలో ఒక విశేషం– ఒక సంచికలో "తోడు దొంగలు"షూటింగ్ స్క్రిప్ట్ ఫోటోలతో సహా ప్రచురించారు. అంటే, కెమెరా మూమెంట్స్ స్పష్టంగా వున్న స్క్రిప్ట్ అది. సాధారణంగా కథా, మాటలూ రాస్తారు గానీ, షూటింగ్ స్క్రిప్ట్ ప్రచురించడం అదే మొదటిసారి అయివుండొచ్చు.

ఈ కినీమా పత్రిక నిరాఘాటంగా నడచిందా? లేక మధ్య మధ్యలో ఆగిపోతూ నడచిందా?తెలీదు గానీ, 1965 వరకు అంటే 13 సంవత్సరాల పాటు కొనసాగిన కినీమా మాస పత్రికకు చివరలో సంపాదకుడు మాగాపు రామన్ గారు. చక్రపాణి కినిమా లాగ 2,3 సంవత్సరాలతో ఆగిపోకుండా, 13 ఏళ్లపాటు నడవడం ఈ పత్రిక యొక్క ప్రత్యేకత. ఈ పత్రికలో కూడా తెలుగు సినిమా పరిశోధకులకు కావలిసినంత విలువైన సమాచారం లభిస్తుంది.

తరవాత, ఆ రోజుల్లోనే ప్రారంభమై 4 సంవత్సరాలు మాత్రమే కొనసాగిన ఇంకొక సినిమా మాస పత్రిక "చిత్రసీమ". కినిమా, సినిమా, తెలుగు సినిమా ఎలాగైతే తెనాలి నుంచి వచ్చి మద్రాస్ లో ప్రారంభించారో, ఈ చిత్రసీమ పత్రిక కూడా తెనాలి నుండి వచ్చిన ధనికొండ హనుమంత రావుగారు ప్రారంభించారు. ఈయన ఆరోజుల్లో చాలా పాపులర్ నవల రచయత. తెనాలిలో ఉండగానే ధనికొండ హనుమంతరావుగారు "జ్యోతీ, రేరాణి, అభిసారిక "అనే పత్రికలు నడుపుతుండేవారు. వ్యక్తిగత కారణాల వల్ల చక్రపాణి గారితో మద్రాస్ వచ్చి, ముందుగా చందమామ ఆఫీసులో కొత్త కాలం పనిచేశారు. తొందరలోనే అక్కడ మానేసి, స్వంతంగా తాను తెనాలిలో నడిపిన పత్రికల్ని మద్రాస్ నుంచి పునః ప్రారంభించారు.

ఆ సమయంలో ఆయన కొత్తగా ప్రారంభించిన పత్రిక ఈ "చిత్రసీమ". 1956 జనవరి 1 న విడుదల అయ్యింది. అసోసియేట్ ఎడిటర్ శ్రీ కొలను బ్రహ్మానంద రావు. తాను స్వతహాగా రచయిత అవ్వడం వల్లనేమో చిత్ర సీమలోని అంశాలనూ, అభిరుచిగల అంశాలుగా తీర్చిదిద్దారు ధనికొండ హనుమంతరావుగారు. రెండవ సంచిక నుండి ఈ చిత్రసీమ సంచికలు లభించాయి. 1956 ఫిబ్రవరి అంటే రెండవ సంచికలో రావూరి భరద్వాజ గారి "చిత్రకథ" అనే సీరియల్ మొదలయ్యింది. అలాగే "ఆత్మకథ "అనే శీర్షికలో ఆనాటి కొత్త నటుల

జీవిత చరిత్రలు పరిచయం చేశారు. విజ్ఞాన విశేషాలూ, గృహాల్లో తారలూ, పారిశ్రామిక రంగం. హాలీవుడ్ చిత్రాలు ఇలాంటి శీర్షికలు అన్ని వున్నాయి. ఇందులో కూడా గాసిప్స్ గానీ, వివాదాలు గానీ ఏవీ లేవు. ఆ రోజుల్లో లోపల పేజీల్లో సింగిల్ కలర్ ఫోటోలు వేసిన ప్రత్యేకత ఈ చిత్రసీమ పత్రికదే అనుకోవచ్చు. ఒక సంవత్సరం తర్వాత సంపాదకత్వం బాధ్యతల్ని కొలను బ్రహ్మానంద రావుగారు తీసుకున్నారు.

1959 జూన్ సంచికను రేలంగిగారి సన్మానోత్సవ ప్రత్యేక సంచికగా ప్రచురించారు. మిగతా చాలా సినిమా పత్రికల్లాగానే ఈ చిత్రసీమ కూడా 4 ఏళ్ళు మించి కొనసాగలేదు. ఇలా తెలుగు సినిమా, చిత్రసీమా, సినిమా, కినిమా... ఇవేవి ఎక్కువ కాలం కొనసాగక పోయినప్పటికీ, 70 సంవత్సరాల క్రిందటి ఈ పత్రికల్లో సినీ పరిశోధకులకు అత్యంత విలువైన సమాచారం లభిస్తుంది.

ఆ రోజుల్లోనే వచ్చిన మరో సినిమా పత్రిక ''రూపవాణి'' మాస పత్రిక. ఇది పూర్తిగా సినిమా పత్రిక అంటే, అవును అనలేం. అలాని కాదని కూడా అనలేం. దీని సంపాదకులు బి. సీతారామయ్య గారు. ఇది సుమారుగా 1938లో ప్రారంభమయింది. మొట్ట మొదట్లోనే సంచికల్ని చూసుకుంటే ఇది కేవలం సినిమా పత్రికల్లాగా లేదు. వాళ్ళు ప్రకటించడం కూడా సచిత్ర మాసపత్రిక అనీ, తెలుగు వారి కోసం పత్రిక అనీ ఇలా రాసుకున్నారు. లోపల అంశాలు కూడా మామూలు కథలూ, వ్యాసాలూ సినిమా విశేషాలు కొద్దిగా ఉండేవి. 1950 సంవత్సరం వచ్చేసరికి, ప్రముఖ సినిమా మాసపత్రికగా మారింది. అలాని టాగ్ లైన్ లో రాసుకున్నారు కూడా. అసోసియేట్ ఎడిటర్ గా మాగాపు రామన్ ఉండేవారు. సంపాదకీయాలూ, వ్యాసాలూ చాలా ఘాటుగా ఉండేవి. వివాస్పదమైన వార్తలూ, సినిమా తారల విన్నవీ, కన్నవీ వాళ్ళ గురించి రాస్తే, వాటిని ఆ సినిమా వాళ్ళు ఖండించడం, ఇలాంటివన్నీ కూడా ఉండేవి. మళ్ళీ తరవాత రోజుల్లో "ప్రముఖ మాసపత్రిక" అని టేగ్ లైన్ మార్చుకున్నారు గానీ, ఎక్కువగా సినిమా వార్తలే ప్రచురిస్తూ, 1975 వరకూ కొనసాగింది.

బహుశా అప్పట్లో వచ్చిన పత్రికల్లో ఎక్కువ కాలం అంటే దాదాపు 40 సంవత్సరాలు వచ్చింది. అయితే, మధ్య మధ్యలో ఆగిపోయిందో, నిరాఘాటంగా వచ్చిందో తెలియదు గానీ, అన్ని సంవత్సరాలు నడచిన సినిమా పత్రిక రూపవాణి.

తరువాత ఇన్ని సినిమా పత్రికలు నడవడం, ఆగిపోవడం వీటన్నిటి మధ్యా ప్రారంభమయి 20 ఏళ్లపాటు అత్యంత ప్రామాణికమైన సినిమా పత్రికగా నడిచింది "సినిమారంగం". 1954 ఏప్రిల్లో మొదటి సంచిక వచ్చింది. నా దగ్గర వున్న సమాచారం ప్రకారం 1974 జూలై వరకూ అంటే, 20 ఏళ్ళు పైన కొద్ది నెలలు నడిచింది. మిగిలిన సినిమా పత్రికలకంటే ఎక్కువ స్థాయిలో నడచిన పత్రిక ఈ సినిమా రంగం అని చెప్పుకోవచ్చు. పబ్లిషర్ టి. వి. రామనాధ్ అయితే, మొదటి 10 సంవత్సరాలకి విశ్వేశ్వరావు అనే ఆయన అసోసియేట్ ఎడిటర్ గా వున్నారు.

చివరి 10 సంవత్సరాలు అసోసియేట్ ఎడిటర్ గా "జి. వి. జి. గారు(గడియారం వెంకట గోపాలకృష్ణ) ఉండేవారు. ఈయన స్వతహాగా డిటెక్టివ్ నవలలు రాస్తూండేవారు. ఆ రోజుల్లో సినిమాల్లో చిన్నచిన్న పాత్రల కూడా ధరించారు. ఆయన ఈ సినిమా రంగం పత్రికను అత్యున్నత ప్రమాణాలతో నడిపారు అని చెప్పుకోవచ్చు. రెండు దశాబ్దాల సినిమారంగం ప్రయాణంలో అనేక ప్రత్యేకతల గురించి చెప్పుకోవచ్చు.

మొదటిది పత్రిక సైజు. అప్పట్లో వచ్చిన సినిమా పత్రికల కంటే, చిన్న సైజులో మొదలయ్యింది. మొదటి పేజీ మల్టీ కలర్ గ్లాస్ పేపరుతో మిగతా పత్రికల కంటే భిన్నంగా కనిపించేది. ఒకే సినిమాలోని స్టిల్స్ 2,3 పేజీల్లో వరసగా సింగల్ కలర్ లో ప్రచురించడం ఈ సినిమా రంగంతోనే మొదలైంది. సినిమా కథా, మాటలూ అనే ఫీచర్ కూడా రెగ్యులర్ గా ఉండేది. అన్నిటికంటే ప్రధాన ఆకర్షణ తారల వర్ణ చిత్రాల గ్లాసీ ప్లేట్స్ లోపల పేజీల్లో ఉండేవి. అప్పట్లో ఇంకా ఏ పత్రికలో కూడా ఇలా పూర్తి పేజీ సినిమా తారల వర్ణ చిత్రాలు ఉండేవి కావు. మల్టీ కలరు తారల చిత్రాలు ఒక సెట్ గానూ, మళ్ళా సింగల్ కలరు తారల చిత్రాలు ఇంకో సెట్ గానూ ప్రతి సంచికలోనూ ప్రచురిస్తుండేవారు.

ఇవే కాకుండా షూటింగు లో స్టిల్స్, తారల ఇంటర్వ్యూలూ, హిందీ చిత్ర సీమ విశేషాలూ, హిందీ తారల స్టిల్స్, అలాగే ప్రతి సంవత్సరం మొదట్లో, క్రిందటి సంవత్సరం వచ్చిన సినిమాలూ, వాటి తీరుతెన్నులూ వాటి విశ్లేషణా ఇలాంటి వన్నీ ప్రత్యేకంగా ఉండేవి ఈ పత్రికలో గాసిప్స్ గానీ, వివాదాలు గానీ ఉండేవి కావు. "జి. వి.జి. ప్రశ్నలూ–జవాబులూ " ఇంకొక ఆకర్షణ. అలాగే దర్శకుడు సి. ఎస్, రావు గారు "చిత్ర సీమలో చిదానందం " అనే శీర్షికలో చిన్న చిన్న టిట్ బిట్స్ రాస్తూండేవారు. సి.వి. రమణ అనే ఇంకొ కాయన హాస్య గల్పికలు రాస్తూండేవాడు. ప్రతి సంచికలోనూ ఏదో ఒక అదనపు ఆకర్షణా,ఆసక్తికరమైన అంశం వుంటుండేది ఈ సినిమా రంగంలో మాస పత్రికలో.

తెలుగు సినిమా పరిశ్రమ చరిత్ర రాయాలి అంటే, ఖచ్చితంగా సినిమారంగం పత్రికను అధ్యయనం చేసి తీరాలి.

ఇవీ 1950 ప్రాంతాల్లో ప్రారంభమైన ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, మరి కొన్ని సినిమా పత్రికల విశేషాలు.

కాల క్రమంలో 1950 నుంచి ముందుకు వెళితే, తరవాత మైలు రాయి 1960. 1960 లలో ప్రారంభమైనది "ఆంధ్రజ్యోతి" దినపత్రిక. ఆ తరవాత మరో 7 సంవత్సరాలకు 1967 లో ప్రారంభమైన ఆంధ్రజ్యోతి వార పత్రిక. ఇది చాలా అందమైన పేరు. స్ఫూర్తి దాయకమైన పేరు. కళాత్మకమైన పేరు. అయితే 1960 లో ప్రారంభమైన ఆంధ్రజ్యోతి దినపత్రిక కంటే ముందే "ఆంధ్రజ్యోతి"అనే పేరుతో రెండు సార్లు పత్రికలు వచ్చాయి. ఆ

విశేషాలు ముందుగా తెలుసుకుందాం. అంటే కాల క్రమంలో కొంచెం వెనక్కి వెళదాం. ఆంధ్రజ్యోతి అనే పేరుతో మొట్ట మొదటి సారిగా ఒక వార పత్రిక బర్మా నుంచి వచ్చింది. అది కూడా 1936 లో.

1936 డిసెంబర్ ఆంధ్రభూమి అనే మాస పత్రిక లోని ఒక ప్రకటన ఇలా వుంది.

ఆంధ్ర జ్యోతి , మొల్మెన్ , వార పత్రిక, సాలు చందా 3 రూపాయలు, విడి పత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పట్టుబడుచున్న వార పత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు, నిస్పాక్షికముగా చర్చించబడును. దీనికి బర్మా అంతటనూ ప్రచారము కలదు. వర్తకులు ఇందు తమ సరుకులు ప్రకటించిన మంచి లాభము పొందగలరు. వివరములు: ఎడిటర్ "ఆంధ్ర జ్యోతి", 185, లోవర్ మెయిన్ రోడ్డు, మొల్మెన్ – అని వ్రాయుడు.

ఈ మొల్మెన్ అనేది బర్మాలో ఒక నగరం అన్నమాట. 1936 బర్మాలోనే తెలుగు వాళ్ళు నడుపుకున్న వార పత్రిక ఆంధ్రజ్యోతి. అలా మొదలైందండి ఆంధ్ర జ్యోతి అనే పేరు. ఇంతకు మించి పత్రిక వివరాలు ఏమీ లభ్యం కావడం లేదు. ఎన్నాళ్ళు వచ్చిందో కూడా తెలీదు. దీన్ని ఇక్కడ ఆపేద్దాం.

1940 ప్రాంతాల్లో బి. ఎన్. గుప్తా అనే ఆయన బెంగళూర్ లో వాహిని వారి చిత్రాలను పంపిణీ చేస్తుండేవాడు. ఆయన మద్రాసులోని త్యాగరాజ నగర్ లో ఉండేవాడు. అయన మరి ఈ బర్మా వాళ్ళ దగ్గర నుండి ఈ ఆంధ్ర జ్యోతి హక్కులు కొన్నారో, లేక ఆయన స్వంతంగా ప్రారంభించారో తెలియదు గానీ, 1941 లో మద్రాస్ నుంచి ఆంధ్రజ్యోతి అనే వార పత్రికను నడిపారు. అది నాగిరెడ్డి గారి ప్రెస్ లో ప్రింటవుతుండేది. దాని సంపాదకుడు, ఇతర వివరాలు ఎక్కడ లభ్యం కాలేదు. అయితే, ఆ బి.యెన్ .గుప్తా గారి ఆంధ్రజ్యోతి వార పత్రిక రెండు ఏళ్ళు వచ్చాక 1943 లో ఆగిపోయింది. ఆ పత్రిక ప్రింటింగ్ పనుల కోసం వచ్చే పనులలో గుప్తా గారికీ, నాగిరెడ్డి గారికీ మంచి పరిచయం ఏర్పడింది. 1944 లోనే చక్రపాణి గారు మద్రాస్ రావడం, నాగిరెడ్డి గారితో పరిచయం, ఆ క్రమంలో ఇలా ఆంధ్రజ్యోతి అనే పత్రిక ఆగిపోయి వున్నదని తెలుసుకొని, నాగిరెడ్డి గారికి, చక్రపాణి గారు ఒక సలహా ఇచ్చారు.

" ఆ పత్రిక కొని, దాన్ని మాస పత్రికగా నడుపుదాం. ఇప్పుడు స్వాతంత్రోద్యమం తారా స్థాయిలో వుంది కదా! మనం కూడా ఉద్యమానికి ఊతం ఇచ్చినట్టవుతుంది "అని నాగిరెడ్డి గారికి చెప్పారు.

అలా ఆ బి. ఎన్. గుప్తా గారి దగ్గర నుండి కొన్న ఆంధ్ర జ్యోతి వార పత్రికను చక్రపాణి గారు తన సంపాదకత్వంలో నాగిరెడ్డి గారు పబ్లిషర్ గా 1945 జూలై లో మాస పత్రికగా పునర్దర్శనం ఇచ్చింది. చక్రపాణి గారి మార్కు స్థాయిలోనే విలక్షణమైన పత్రికగా 10 ఏళ్లపాటు 1955 ఏప్రిల్ వరకూ నడిచింది. మొట్ట మొదటి సంచిక లో ఏం వున్నదో చూద్దాం. "ఆంధ్ర జ్యోతి, మాస పత్రిక సంపాదకుడు :చక్రపాణి,సంపుటి:5, సంచిక :1, జూలై 1945,

"ఆంధ్రజ్యోతి పాఠకులను దర్శించుకొని దాదాపు రెండు సంవత్సరాలు అయింది. ఈ మధ్యలో మనదేశం ఎన్నో కరువులకూ, కాటకాలకూ, జాడ్యాలకూ గురయ్యింది. దేశనాయకులంతా జైళ్లలో బంధింపబడ్డారు. కానీ, ఈనాడు పరిస్థితులు చాలా మారినట్లు కనిపిస్తోంది. నాయకులు చాలా బాగా విడుదలయ్యారు. ఇలాంటి ఉత్తమ వాతావరణంలో మేము ఆంధ్రజ్యోతిని పట్టుకొని ఆంధ్రుల ద్వారం ముందు నిలబడ్డాం. ఈ ఆంధ్రజ్యోతి ఆంధ్రులకు కొత్తగా మార్గం చూపిస్తుందని గానీ, కనీసం పెద్ద వెలుగునిస్తుందని గానీ, మేము చెప్పలేం. కానీ, పెద్దలు నడిచే మార్గాలనూ, నాయకులు వేసే త్రోవలను మాత్రం చూపించగలదు. ఇదే మేము ఆంధ్రులకు చేయగలిగిన సేవ. ఇలా సరిగా చేయగలిగిన నాడు ఆంధ్రమాత పట్లా, ఆంధ్రజాతి పట్లా మాకు వున్న కర్తవ్యం కొద్దిగా నైనా నిర్వహించామని సంతృప్తి పడతాము. "

దీన్ని ఆంధ్రజ్యోతి ఆశయంగా చక్రపాణి గారు చెప్పారు. అప్పటికి ఇంకా చందమామ ప్రారంభం కాలేదు. ఇది 1945 లో జరిగింది. మొట్ట మొదటి సంచికలో ఏం వున్నాయో చూద్దాం. ఇందులో ఆనాటి ప్రముఖ రచయితలు చాలా మంది రాశారు. ఇంకొక ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే, వేరే పత్రికల్లో సంపాదకులుగా వున్న వాళ్ళు కూడా ఈ ఆంధ్రజ్యోతి మాస పత్రికలో రాశారు అంటే, చక్రపాణి గారి మీద వున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తుంది. కాసా సుబ్బారావుగారూ, నార్ల వెంకటేశ్వరావు గారూ, వీళ్ళు వేరే పత్రికలకు ఎడిటర్లుగా పనిచేస్తున్నారు. అయినా గాని ఆంధ్రజ్యోతిలో ఆర్టికల్స్ రాశారు. మునిమాణిక్యం నరసింహారావు గారూ, కొడవటిగంటి కుటుంబరావు గారూ, వీళ్ళ రచనలు వున్నాయి. ఇంకో ప్రత్యేకత ఏమిటంటే, విషయ సూచికలో ఎవరు, ఏమి రాశారు అనేది కాకుండా, కేవలం రచయితల పేర్లు మాత్రం వేశారు. అంటే, రచయితలకి ఎక్కువ గౌరవం ఇచ్చినట్లుగా చూపించారు.

దీన్లోనే – చలంగారి "మ్యూజింగ్స్ "సీరియల్ గా రావడం ప్రారంభమైంది. అలాగే చక్రపాణి గారు బెంగాలీ నవలలు తెలుగులోకి అనువాదం చేసేవారు. ఆయన అనువాదం చేసిన శరత్ నవల "వాగ్దత్త" మొట్ట మొదటి సంచిక నుంచే సీరియల్ గా రావడం ప్రారంభమయింది. దీనికి చక్రపాణి గారు శరత్ బాబు గారికి ఇచ్చిన గౌరవం ఏమిటంటే... రచయిత:శరత్ బాబు అనే రాసారు కానీ, అనువాదం:చక్రపాణి అని ఎక్కడా రాయలేదు. ఇంకో రెండు ఆసక్తికరమైన శీర్షికలు ఏమిటంటే, ఆంధ్రజ్యోతి పజిల్స్, నిర్వహణ శ్రీశ్రీ. ఇదంతా వినోదం కోసమే, ఇంకా విత్తం మీద కాంక్ష లేదు. అని ఒక పజిల్ వేశారు శ్రీశ్రీ గారు రాసింది.

అలాగే మరొకటి ఏమిటంటే, "గ్రహపాటు" అంటే రాసి ఫలాలు. దాని కింద ఒక టేగ్ లైన్ పెట్టారు "నమ్మకం వున్నవారికి మాత్రమే". ఎందుకంటే, చక్రపాణి గారు ఎప్పుడూ కూడా మూఢ విశ్వాసాలను ప్రచారం చేసేవారు కాదు. అలాగే రెండవ సంచిక 1945 ఆగస్ట్ కవరు పేజీ ప్రకాశం పంతులు గారిది. రెండో

సంచికలో రచయితలు కూడా కాసా సుబ్బారావుగారూ, మునిమాణిక్యం, కుటుంబరావు గారూ, ఎస్. అన్నపూర్ణా దేవి గారూ, కె. కృషారావు గారూ... శ్రీశ్రీ మా గోఖలే, శరత్ బాబూ... ఇలాంటి వారివన్నీ వున్నాయి. ఇదిలా నడుస్తుండగానే 1947 లో చందమామ ప్రారంభమయింది కదా! ఈ రెండూ కూడా సమాంతరంగా నడిపారు.

1947 ఆగస్టు ఆంధ్రజ్యోతి సంచికలో రాసారూ.. "వచ్చే సంచిక స్వాతంత్ర దినోత్సవ ప్రత్యేక సంచిక గా వస్తుంది"అని చెప్పారు. కానీ, 1947 సెప్టెంబర్ వరకూ ఆగకుండానే స్వాతంత్రం వచ్చిన కొద్దీ రోజులకే భారతదేశ స్వాతంత్ర దినోత్సవ ప్రత్యేక సంచికగా వెలువరించారు, 116 పేజీలతో. దాన్లో అద్భుతమైన వ్యాసాలు వున్నాయి. అది కలెక్టర్స్ ఎడిషన్ అని చెప్పుకోవచ్చు. ఇప్పటికి కూడా అప్పట్లో జరిగిన స్వాతంత్ర పోరాటాన్ని సంక్షిప్తంగా చూడాలి అంటే, ఈ 1947 ఆగస్టు-సెప్టెంబర్ ప్రత్యేక సంచిక చక్కటి విశేషాలను అందిస్తుంది. ప్రత్యేక సంచిక తెరవగానే నాకు కనిపించింది. కొన్ని పద్యాలు కనిపించాయి. అవి రాసినయన పేరు గురజాడ రాఘవశర్మ గారు.

ఈ గురజాడ రాఘవ శర్మగారు స్వాతంత్ర్యం గురించి, పద్య కావ్యాలు చాలా రాశారు. ఆ రోజుల్లో చాలా ప్రసిద్ధి చెందిన కవి. ఈయన గురించి ప్రత్యేకంగా ఎందుకు చెబుతున్నానంటే, ఆ గురజాడ రాఘవ శర్మ గారితో కలసి, ఆయన శిష్యరికం చేసే అదృష్టం నాకు లభించింది. ఈ పత్రిక వెలువడిన 22 సంవత్సరాల తర్వాత, నేను బందరులో చదువుకునేటప్పుడు, ఆ గురజాడ రాఘవ శర్మగారి ఇంటి పక్కనే అద్దెకి ఉండేవాళ్ళం. అప్పుడప్పుడు ఆయన ఇంటికి వెళ్ళి, ఆయన రాసినటు వంటి పద్యాలూ అలాంటివన్నీ ఫెయిర్ చేస్తుండేవాడిని. అప్పుడు నేను చాలా చిన్న పిల్లాడ్ని. ఆయన పేరు మళ్ళీ ఇప్పుడు ఆంధ్ర జ్యోతి మాస పత్రికలో చూడడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

ఇంకా ఈ ప్రత్యేక సంచికలో ఏం వున్నాయంటే, బ్రిటీష్ వాళ్ళ పాలన గురించి, ఒక సమగ్రమైన వ్యాసం వుంది. "బ్రిటీష్ వాళ్ళు పాలించేటప్పుడు వాళ్ళేదో మంచి పనులు చేశారని అనుకున్నాము. కానీ, భారతదేశాన్ని నాశనం చేసిన విధానం ఇది " అని చాలా సమగ్రంగా రాశారు. అలాగే పండితారాధ్యుల నాగేశ్వరావు గారు. అప్పట్లో ఆంధ్రప్రభలో పనిచేస్తుండేవారు. ఆయన "బ్రిటన్ తో కాంగ్రెస్ పోరాటం"అని కాంగ్రెస్ చేసిన పోరాటం గురించి రాశారు. ఇంకా ఆ స్వాతంత్రోద్యమ సమయంలో జరిగిన సాయుధ పోరాటాల గురించి చాలా వ్యాసాలు వున్నాయి. "ఆలీపూర్ కుట్ర కేసు", గదర్ పార్టీ ప్రారంభం కావడం, కాకోరీ రైలు కేసు... ఇలాంటివన్నీ వున్నాయి. "జాతీయ జెండా" అనే వ్యాసంలో అసలు భారతదేశపు జెండా ఎలా ప్రారంభం ఐయింది? అప్పటి రూపం ఎలా వచ్చింది? అలా సమగ్రమైన వ్యాసం వుంది.

ఇంకా ఈ పత్రిక గురించి చెప్పుకోవాలంటే, చక్రపాణి గారు సంపాదకీయాలు ఆయన మాత్రమే కాకుండా సమయం, సందర్భం వచ్చినపుడు బయట వాళ్ళతో కూడా సంపాదకీయాలు వ్రాయించి, వాళ్ళ పేరే వేస్తుండేవారు. సాధారణంగా సంపాదకీయాలు , సంపాదకులవే ఉండేవి. లేదా పేరు లేకుండా ఉండేవి. ఒక వేళ ఎవరైనా రాసినా గానీ, వాళ్ళ పేరు ఉండేది కాదు. కానీ, చక్రపాణి గారు ఆ సాంప్రదాయానికి భిన్నంగా ఎవరు సంపాదకీయం రాస్తే, వాళ్ళ పేరు వేసేవారు. అదొక విశిష్టమైన, విన్నూతనమైన సాంప్రదాయం అని చక్రపాణి గారిని అందరినీ మెచ్చుకున్నారు ఆ రోజుల్లో.

అలాగే, 1947 జూలై సంచికలో రాసారు స్వాతంత్రం రావడానికి ఒక రోజు ముందు “ఆంధ్రజ్యోతి మొట్ట మొదటి నుండి కాంగ్రెస్ అభిప్రాయాలనే బలపరుస్తూ వస్తోంది. అంతే గానీ, ఏ ఒక్క వ్యక్తి యొక్క గొప్ప ప్రచారాన్ని చెయ్యలేదు. ఇక ముందు కూడా ఉద్యమాన్ని బలపరుస్తుంది తప్ప, వ్యక్తిని కాదు.“ అని రాసారు. ఈ పత్రిక వచ్చినన్ని రోజులూ సందర్భానుసారం ప్రత్యేకమైన సంచికల్ని వెలువరించారు. 1945 అక్టోబర్ సంచికను మహాత్మా గాంధీ గురించీ, ఆయన ఉద్యమం గురించి, ప్రముఖుల వ్యాసాలూ, అనువాదాలతో వెలువరించారు.

ప్రపంచ రాజకీయాల గురించి నార్ల వెంకటేశ్వరావు గారు “కల్లోల ప్రపంచం”అనే శీర్షికతో ప్రతినెలా రాస్తూండేవారు. ముఖ్యంగా సాహిత్య పరంగా చెప్పుకోవాలంటే, చలంగారి ”మ్యూజింగ్సు” శ్రీశ్రీ గారి “సిరి మువ్వ శతకం “ ... ఇలాంటివన్నీ కూడా ఈ పత్రిక ద్వారా వెలుగు చూశాయి. ఇంకా ఈ పత్రిక మరొక ప్రత్యేకత – చక్రపాణి గారు సహజంగా రచయిత కావడం వల్ల రచయితల మీద చాలా సానుభూతి ఉండేది. ఈ పత్రికలో ప్రచురించబడిన ప్రతి రచనకూ తప్పనిసరిగా పారితోషికం పంపిస్తుండేవారు. అది కూడా ఎలాగా ? ఈ పత్రిక పోస్ట్ లో కాపీ అందిన రోజే మానియార్డ్ రు కూడా అందాలి. చక్రపాణి గారు అంత జాగ్రత్తగా, అంత పక్కాగా పారితోషకాన్ని పంపించే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఇవి చక్రపాణి గారు 10 ఏళ్ల పాటు కొనసాగించిన ఆంధ్ర జ్యోతి మాస పత్రిక విశేషాలు.

దీని తర్వాత మరో 5 సంవత్సరాలకు ప్రారంభమయింది ఆంధ్రజ్యోతి దినపత్రిక. దాని విశేషాలు వచ్చేభాగంలో తెలుసుకుందాం.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 సెప్టెంబర్ 23 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS